
సాక్షి బాపట్ల
సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025



ఎరువుల నిల్వలు తనిఖీ


నకరికల్లు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలోని ఎరువుల నిల్వలను జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,34,000 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 1,43,502 క్యూసెక్కులు వదులుతున్నారు.

గోగులమ్మకు ప్రత్యేక పూజ



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి పుష్ప కైంకర్య సేవలో భాగంగా కవల తమలపాకుల పూజ నిర్వహించారు.

న్యూస్‌రీల్

సరిపడా యూరియా పంపిణీకి చర్యలు



చీరాల టౌన్: చీరాల డివిజన్ పరిధిలో పంటలు సాగు చేసే ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. ఆదివారం చీరాల మండలంలోని గవినివారిపాలెం, తోటవారిపాలెం, తదితర గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా నిల్వలను ఆర్డీవో చంద్రశేఖర నాయుడు, తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణలు వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ నిల్వలను, రికార్డులను, యూరియా పంపిణీ విధానాన్ని తెలుసుకున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. అధిక ధరలకు విక్రయించకుండా, అక్రమ నిల్వలు చేయకుండా కట్టడి చేశామన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిత్యాన్నదానానికి సామగ్రి వితరణ



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నిత్యాన్నదానానికి బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి గ్రామస్తుడు గండే కృష్ణమ నాయుడు, మౌనిక దంపతులు సామగ్రి వితరణ చేశారు. తమ చిన్నారులు త్రిషికదేవి, నిహిరదేవి పేరిట 200 కుర్చీలు, వెయ్యి గ్లాసులు, 15 ఐరన్ టేబుళ్లు బహూకరించారు. ఆదివారం ఉదయం స్వామిని దర్శించుకున్న వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు వీటిని అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

సజావుగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎంపిక పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆదివారం గుంటూరులోని వివిధ పరీక్ష కేంద్రాల్లో స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. ఏసీ కళాశాల, టీజేపీఎస్, విజ్ఞాన్ నిరూల డిగ్రీ, పీజీ కళాశాలలోని పరీక్ష కేంద్రాల్లో జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి పరిశీలించారు.

పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,216 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 340, బ్యాంక్ కెనాల్‌కు 1,930, తూర్పు కాలువకు 720, పశ్చిమ కాలువకు 241, నిజాపట్నం కాలువకు 454, కొమ్మూరు కాలువకు 3,420, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 53,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

30 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: 12వ వేతన సవరణకు సంబంధించిన సంఘాన్ని నియమించాలని ఏపీ ఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ ద్వితీయ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. ఇవ్వండయ్యా..!

- మరుప్రోలువారి పాలెంలో రైతుల పడిగాపులు
- చెట్ల కిందే గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి
- రోజురోజుకు తీవ్రం అవుతున్న యూరియా ఇబ్బందులు
- కొందరికే ఇవ్వడంతో మిగతా వారికి తప్పని ఇక్కట్లు
- ఆయకట్టు 3 వేల ఎకరాలు.. వచ్చింది 200 బస్తాలే
- ఎకరాకు అరకట్ట చొప్పున ఇచ్చినా 1,500 బస్తాలు అవసరం
- కూటమి సర్కార్ తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం

కూటమి పాలనలో అన్నదాతలకు తప్పని కష్టాలు

రైతులకు యూరియా వ్యథలు తీరడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు మొదలైన నాటి నుంచి ఏదో ఒక సమస్య అన్నదాతలను వెంటాడుతూనే ఉంది. సాగు ప్రారంభంలో సకాలంలో నీరు లేక పైర్లు ఎండిపోయాయి. కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పైర్లు మొత్తం దెబ్బతిన్నాయి. వర్షపు నీరు బయటకు పంపి ఉన్న పైర్లకు తోడు బయట ప్రాంతాల నుంచి సెంటు నారు రూ. 2 వేల నుంచి రూ.2,500 చొప్పున తెచ్చి నాటారు. ఇప్పుడు కూటమి పాలకుల దెబ్బకు యూరియా కూడా దొరకడం లేదు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు కన్నీళ్లే మిగిలాయి.



యూరియా కోసం మరుప్రోలువారిపాలెం గోదాము వద్ద ఎదురు చూస్తున్న రైతులు

బాపట్ల టౌన్: మండలంలోని మరుప్రోలువారిపాలెం ఎరువుల గోదాము వద్ద రైతులు ఆదివారం యూరియా కోసం ఆగ్రహంతో రగిలిపోయారు. యూరియా గోడౌన్‌కు చేరిందన్న విషయం తెలుసుకున్న ఆ ప్రాంత పరిధిలోని మరుప్రోలువారిపాలెం, మద్దిబోయినవారిపాలెం, ఇమ్మడిశెట్టివారిపాలెం, దేవినూతల, బసివిరెడ్డిపాలెం, హనుమాన్‌నగర్, అసోదివారిపాలెం, పోతురాజుకొత్తపాలెం గ్రామాల్లోని రైతులు ఆదివారం ఉదయం 9 గంటలకే అక్కడికి చేరుకున్నారు. అధికారులు ఉదయం 10 గంటల నుంచే పంపిణీ ప్రారంభించారు. రైతులు ఒక్కసారిగా రావడంతో అదుపు చేసేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది కష్టపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు వచ్చి రైతులు కంట్రోల్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పంపిణీ చేసినా అందరికీ ఇవ్వలేకపోయారు. మిగతా రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు.

సరిపడా రాని యూరియా

మరుప్రోలువారిపాలెం రెవెన్యూ గ్రామం పరిధిలోని మరుప్రోలువారిపాలెం, బసివిరెడ్డిపాలెం, పోతురాజుకొత్తపాలెం, అసోదివారిపాలెం, దేవినూతల, మద్దిబోయినవారిపాలెం, ఇమ్మడిశెట్టివారిపాలెం, హనుమాన్‌నగర్, మచ్చావారిపాలెం, చింతావారిపాలెం, కొత్తమద్దిబోయినవారిపాలెం, బొర్రావారిపాలెం, పల్లిపాలెం తదితర గ్రామాల్లో కలిపి మొత్తం 3,200 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లోని రైతులు వెద పద్ధతిలో సాగు చేసి నెల దాటిపోయింది. ఇలా సాగు చేసిన 20 రోజులకే ఎకరాకు అర బస్తా, 40 రోజులకు మరో అర బస్తా చొప్పున యూరియా వేయాలి. ఒక్క మరుప్రోలువారిపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలోని అన్నదాతలకే కనీసం 3 వేల బస్తాల యూరియా అందిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి ముత్తాయపాలెంకు 230, మరుప్రోలువారిపాలెంకు 220 బస్తాల చొప్పున అందజేశారు. యూరియా బయట షాపుల్లో కూడా దొరక్కపోవడంతో రైతులు ఆదివారం ఆయా గ్రామాల నుంచి వందల సంఖ్యలో తరలివచ్చారు. ఒక్కసారిగా గోడౌన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేశారు. గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ యూరియా సరిపడా అందకపోవడం, పంపిణీ కేంద్రాల వద్ద కనీసం తాగునీరు, నీడ కూడా కల్పించకపోవడంతో రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



కనీస వసతులు లేకపోవడంతో చెట్ల కిందే కూర్చున్న రైతులు

ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు



నాలుగు ఎకరాల్లో సాగు చేశాను. వెద పద్ధతిలో నాటి ఇప్పటికే 35 రోజులు అయ్యింది. ఒక్కసారి కూడా యూరియా వేయలేదు. పైర్లు ఎదుగుదల లేక జిగట బారిపోయాయి. యూరియా కోసం బాపట్ల, చీరాలలోని ఎరువుల దుకాణాలకు తిరిగినా ప్రయోజనం లేదు. గ్రామానికి యూరియా వచ్చిందని తెలిసి ఇక్కడికి వస్తే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంచి ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు.

– మున్నం కొండలురెడ్డి, బసివిరెడ్డిపాలెం

రైతులంటే ప్రభుత్వానికి చులకన



ఆదివారం యూరియా ఇస్తున్నారని తెలుసుకొని పొలం పాసుబుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు తీసుకొని ఉదయం 9 గంటలకే వచ్చా. అధికారులు 10 గంటలకు వచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు అక్కడే ఉన్నాం. ఎండలు భగభగ మండిపోతున్నా కనీసం సమీపంలో తాగునీరు, నీడ వసతి కూడా లేదు. మండుటెండలో అల్లాడిపోయాం. రైతులను ఇంత చులకనగా చూడటం సరికాదు. అవసరమైన యూరియా అందరికీ సరిపడా అందజేయాలి. – బుర్ల కోటేశ్వరావు, దేవినూతల

జిల్లా అధికారుల పరిశీలన

విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే వెళ్లి పరిస్థితి చక్కబెట్టాలంటూ జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీవో పి. గ్లోరియా, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి కె.అన్నపూర్ణమ్మ, తహసీల్దార్ షేక్ సలీమా, ఏడీఏ, ఏవో కె. శారదలు గ్రామానికి చేరుకున్నారు. మరో లోడు తెప్పించి ఇస్తామని రైతులకు నచ్చచెప్పారు.

పాలకుల తీరుతో రైతులకు ఇక్కట్లు

- వైఎస్సార్‌సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



క్యూలైనులోని రైతులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: కూటమి అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు ఇక్కట్లు తప్పడం లేదని, యూరియా కోసం ఎండలో గంటల తరబడి బారులు తీరాల్సిన దుస్థితి వచ్చిందని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మార్కెట్ యార్డ్ ఆవరణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయం వద్ద క్యూ లైనులో యూరియా కోసం వేచి చూస్తున్న రైతులతో ఆదివారం ఆయన మాట్లాడారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ శాతం కౌలు రైతులే లైన్‌లో ఉన్నట్లు తేలింది. ఉన్నతాధికారులు సరిపడా యూరియాను రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. తెల్లవారుజాము నుంచి నిలబడినా ఒక్క బస్తా కూడా దొరకలేదని రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ వైఫల్యమని తెలిపారు. అరకొరగా యూరియా వచ్చినా అధికారులు వారికి కావాల్సిన వారికే ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారని అన్నారు. ఎంత భూమి ఉన్నా ఒక్క బస్తా ఇవ్వడంతో ఏం చేయాలో రైతులకు అర్థం కాక కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. తగినన్ని ఎరువులను అందించేలా చర్యలు తీసుకోవాలని ఈ నెల 9వ తేదీన 'అన్నదాత పోరు' పేరిట నిరసన ప్రదర్శన నిర్వహించి, రేపల్లె ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు అశోక్‌బాబు తెలిపారు.

తక్కువ ధరకు బంగారమంటూ మోసం

- కర్ణాటక వ్యాపారికి ముఠా కుచ్చుటోపీ
- రూ.14 లక్షల నగదు దోచుకుని పరారీ
- నిందితులను అరెస్టు చేసిన చీరాల పోలీసులు



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల అర్బన్: తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని మాయ చేసే కర్ణాటకు చెందిన ఏడుగురు సభ్యుల ముఠాను చీరాల పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. దోపిడీ జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించారు. ఆదివారం ఈపురుపాలెం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఎండీ మొయిన్ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... చీరాలలో తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని కర్ణాటక రాష్ట్రం గంగావతికి చెందిన ఏడుగురు ముఠాలోని ఒకరైన సాతుపాటి యువరాజు.. కర్ణాటక రాష్ట్రం దొడ్డపేటకు చెందిన స్వర్ణకారుడు నాగరాజును నమ్మించాడు. నాలుగు నెలల క్రితం ఫోన్ ద్వారా ఈ విషయం చెప్పాడు. చీరాలకు వస్తే తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని పేర్కొన్నాడు. నాగరాజుకు నమ్మకం కలిగించేందుకు ఒక బంగారు ఆభరణాన్ని చూపించాడు. ఈ క్రమంలో శనివారం నాగరాజును చీరాల ఆటోనగర్ దగ్గర గల బోయినవారి పాలెం రైల్వేట్రాక్ వద్దకు రమ్మని చెప్పడంతో రూ.14 లక్షల నగదుతో నాగరాజు, అతని సోదరుడు అక్కడకు వెళ్లారు. అక్కడ కలుసుకున్న నిందితుడు.. బంగారం తీసుకుని మా వాళ్లు అక్కడకు వస్తారని చెప్పి వెళ్లాడు. అనంతరం మరో ఆరుగురు వ్యక్తులు అక్కడకు వచ్చి డబ్బు చూపించాలని చెప్పడంతో వెంట తెచ్చిన నగదును బాధితులు వారికి చూపించారు. అనంతరం ముఠా సభ్యులు నాగరాజును, అతని సోదరుడిని కత్తితో గాయపరిచారు. వారి వద్ద ఉన్న నగదును, సెల్‌ఫోన్‌లను లాక్కొని కర్ణాటకకు చెందిన కారులో పరారయ్యారు. దీంతో బాధితుడు వెంటనే ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ సీఐ శేషగిరి రావు, ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులు ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల వైపు వెళుతున్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసులకు సమాచారం అందించడంతో వారు నిందితుల కారును అడ్డగించారు. ప్రకాశం జిల్లా పోలీసుల సహకారంతో నిందితులను పెదదోర్నాల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14 లక్షల నగదుతోపాటు ఒక కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే కేసును ఛేదించిన చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్, రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది, ట్రైనీ ఎస్సై ఎస్.అలేఖ్య, హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటరామరాజు, కానిస్టేబుళ్లు బాలచంద్ర, మోహనరావు, రమేష్, మహిళా కానిస్టేబుల్ అనిత, ఆదిలక్ష్మి, హోంగార్డు రవిరెడ్డిలను ఎస్పీ అభినందించారు.

రైతులను నట్టేట ముంచిన చంద్రబాబు

- కనీస అవగాహన లేని వారికి మంత్రి పదవులు
- అన్నదాతల వెన్నంటి ఉండే పార్టీ వైఎస్సార్‌సీపీ
- మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి
- 9న 'అన్నదాత పోరు' జయప్రదానికి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, పార్టీ నాయకులు

బాపట్ల: రైతులను చంద్రబాబు సర్కారు అన్నివిధాలుగా నట్టేట ముంచిందని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ డివిజన్లలో నిరసన ప్రదర్శన, ఆర్డీఓలకు వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమ పోస్టరును ఆదివారం స్థానిక కోన ఛాంబర్‌లో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ... చంద్రబాబు సర్కారు వచ్చాక పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేదన్నారు. రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఆయన మోసం చేశారని గుర్తు చేశారు. కనీస అవగాహన లేని అచ్చెన్నాయుడుకు మంత్రి పదవి ఇచ్చి రైతులను అయోమయానికి గురి చేశారన్నారు. రైతులను ఎరువుల కోసం క్యూలో నిలబెడితే తప్పేంటంటూ పేర్కొనడం రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతోందన్నారు.

వైఎస్ జగన్ హయాంలో మేలు


ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నప్పుడు రైతుల పట్ల ప్రతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని గుర్తుచేశారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయటంతోపాటు శాశ్వత ఉద్యోగులను కూడా నియమించారన్నారు. రైతులను నేరుగా సేవలు అందేలా కృషి చేశారని గుర్తు చేశారు. ఈ క్రాప్ బుకింగ్‌లు కూడా వెనువెంటనే చేయటంతోపాటు రూ.730 కోట్లు రైతులకు సంబంధించిన బీమా రుసుము కూడా చెల్లించారని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనం నుంచి దిగుబడి వరకు అనేక జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వంగా ఆయన వ్యవహరించారన్నారు. నేడు రైతులు యూరియా కోసం బారులుతీరాల్సిన దుస్థితి నెలకొందన్నారు. యూరియా అవసరం లేని పర్చూరు నియోజకవర్గంలో టన్నుల కొద్దీ యూరియా ఉంటే, అవసరమైన ప్రాంతాల్లో లేదన్నారు. అధికారులు కూడా యూరియా బ్లాక్‌లోకి వెళ్లినా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు.

'అన్నదాత పోరు' జయప్రదానికి పిలుపు

ఈ నెల 9వ తేదీన రైతులకు అండగా అన్నదాత పోరు కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ఉంటుందని కోన చెప్పారు. ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లి రైతుల సమస్యలపై వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండల రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, జాలి రామిరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, రెడ్డింకయ్య, ఇనగలూరి మాల్యాద్రి, తన్నీరు అంకమ్మరావు, మండే విజయకుమార్, చెన్నకేశవులు, జోగి రాజా, శ్రీహరి ప్రకాశ్, అడే చందు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లలో తమ్ముళ్ల కాళ్లబేరం!

- టెండర్లు దక్కించుకునేందుకు తెలుగు తమ్ముళ్ల పాట్లు
- ఇటీవల అడ్డదారిలో దక్కించుకున్న వైనంపై 'సాక్షి'లో కథనం
- దాని ఆధారంగా పలువురిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన అధికారులు
- వర్కులను ఎలాగైనా దక్కించుకోవాలని వెంపర్లాడుతున్న పచ్చ నేతలు
- టెండర్లలో ఎవరూ పాల్గొనవద్దంటూ వాట్సాప్ మేసేజ్‌లు



టెండర్‌లో పాల్గొనవద్దంటూ వాట్సాప్ మేసేజ్

నెహ్రూనగర్: అడ్డదారిలో టెండర్లు దక్కించుకున్న తెలుగు తమ్ముళ్ల వ్యవహార శైలిపై గత నెల 22న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై సమగ్ర విచారణకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశించారు. అడ్డదారిలో టెండర్లు దక్కించుకున్న వారి వివరాలు సేకరించి తనకు అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. కమిషనర్ ఆదేశంతో టెండర్లు రద్దు చేయడంతోపాటు పలువురిని ఇంజినీరింగ్ అధికారులు బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. దీంతో తెలుగు తమ్ముళ్లు లాబోదిబోమని అంటున్నారు.

సగంలో ఆగిపోయిన వర్కులు

నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో ఎక్కువ లాభాలు వచ్చే వాటిని తెలుగు తమ్ముళ్లు బ్లాక్ చేసుకున్నారు. టెండర్లలో పాల్గొనకుండానే దొంగ డాక్యుమెంట్లు పుట్టించి పనుల్ని దక్కించుకున్నారు. లెస్సుల్లో కూడా మాయాజాలం చూపి రూ.కోట్లు విలువైన పనులను కైవసం చేసుకున్నారు. దీనిపై సాక్షిలో కథనాలు ప్రచురితం కావడంతో, అడ్డదారిలో దక్కించుకున్న టెండర్లు రద్దు చేశారు. ప్రస్తుతం పనులు సగం వరకు పూర్తయ్యాయి. తిరిగి టెండర్లు పిలవాలని నిర్ణయించడంతో తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు.

చర్చనీయాంశంగా మారిన మెసేజ్

వర్కుకు ఎవరూ టెండర్ వేయవద్దంటూ టీడీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్ వాట్సాప్ గ్రూప్‌లో మేసేజ్ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. నగర పరిధిలో ఓ డివిజన్‌లో రూ.1.14 కోట్ల పనులపై ఎవరూ టెండర్ వేయవద్దంటూ వేడుకున్నాడు. ఎ అధికారం ఉందని ఏది పడితే అది చేస్తే చెల్లుబాటు అవుతుందని అనుకుంటే ఇలాగే జరుగుతుందని తోటి కాంట్రాక్టర్లు చెప్పుకోవడం గమనార్హం.

నేడు కలెక్టర్‌కు వినతి పత్రం

నగరపాలక సంస్థ అధికారులు కేవలం ఒక వర్గానికే కొమ్ము కాస్తూ వారికే బిల్లులు చెల్లింపులు చేస్తున్నారని, టెండర్ల ప్రక్రియలో అవకతవకలపై మిగిలిన కాంట్రాక్టర్లంతా సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



బాల చాముండేశ్వరి దేవి అమ్మవారు

అమరావతి: పవిత్ర శైవక్షేత్రమైన అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరాలయంలో 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో రేఖ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలలో తొమ్మిదిరోజులపాటు చండీహోమం నిర్వహిస్తామని చెప్పారు. 29వ తేదీన మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం చేయనున్నట్లు తెలిపారు. బాలబాలికలకు ఉచితంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. 29వ తేదీ రాత్రి 8.40 గంటలకు చండీ కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. శమీ వృక్షం కింద ప్రత్యేక వేదికపై అక్టోబరు 2 వ తేదీన రాత్రి స్వామి వారి గ్రామోత్సవం అనంతరం శమీపూజ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. మరోవైపు గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానాలలో కూడా దసరా నవరాత్రోత్సవాలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సీతా సమేత శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో తొమ్మిది రోజులపాలు సాయంత్రం అమ్మవారి ప్రత్యేక పూజలు, బతుకమ్మ పూజ నిర్వహించనున్నారు.

అమ్మవారికి అలంకరణలు ఇలా..

తొమ్మిది రోజులపాటు వేడుకల్లో అమరావతి బాల చాముండేశ్వరి దేవి ఆలయంలో 22 వ తేదీన రజత కవచాలంకృత అలంకరణ, 23న బాలా త్రిపుర సుందరీ దేవి, 24న గాయత్రీ దేవి, 25న అన్నపూర్ణా దేవి, 26న మహాలక్ష్మీ దేవి, 27న శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి, 28న మంగళగౌరీ దేవి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గాదేవి, 01న మహిషాసుర మర్ధిని దేవి, అక్టోబర్ 2న రాజరాజేశ్వరీ దేవి అలంకారాలు ఉంటాయని ఈవో తెలిపారు.

క్లుప్తంగా

వెల్లలచెరువు బాలికకు బంగారు పతకం



సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన ధనుకృతి ఇన్విటేషనల్ షాటోకాన్ కరాటే చాంపియన్‌షిప్‌లో పతకం సాధించింది. పల్నాడు జిల్లా దాచేపల్లిలో ఆదివారం జరిగిన అండర్ 11 కేటగిరీ కడా ఈవెంట్‌లో బంగారు పతకం సాధించినట్లు కోచ్ అఖిల్ తెలిపారు. పోటీల్లో తెలంగాణ నుంచి 350 మంది పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

రూ.1.40 లక్షలు పలికిన లడ్డూ



సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని ఏల్చూరు పాటిమీద ఏర్పాటు చేసిన వినాయక పందిరిలోని శివ లింగాకారంలో ఉన్న లడ్డూకు అధిక ధర పలికింది. తొమ్మిది రోజులు నిత్యం పూజలందుకుని ఆదివారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తోట ఆంజనేయ స్వామి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఏల్చూరుకు చెందిన నారదాసు వెంకయ్య కుమారుడు శ్రీనివాసరావు రూ.1.40,000కు పాట పాడి, లడ్డూను దక్కించుకున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు తమిళనాడు గవర్నర్‌కు ఆహ్వానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3,4,5 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు తమిళనాడు గవర్నర్ శ్రీ ఆర్.ఎన్.రవిని కలసి ఆహ్వానించినట్లు పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. తమిళనాడులోని హోసూరు, కోయంబత్తూర్, మధురై, చెన్నై, తంజావూర్, సేలం, తిరుత్తణి, కంచి, చిదంబరం ప్రాంతాల నుంచి తెలుగు మహాసభలకు తెలుగు ప్రజలు హాజరు కానున్నారని గవర్నర్ దృష్టికి తెచ్చారు. జనవరి 3వ తేదీన ఉదయం 10గంటలకు జరిగే మహాసభల ప్రారంభోత్సవ సభకు విశిష్ట అతిథిగా పాల్గొని తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు తమిళనాడు గవర్నర్ సుముఖత చూపారని గజల్ శ్రీనివాస్ తెలిపారు.

కమీషన్ల కోసమే ప్రైవేటుకు వైద్య కళాశాలలు

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



చెరుకుపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో వైద్య కళాశాలలను కమీషన్ల కోసమే పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆరోపించారు. ఆదివారం గుల్లపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు వైద్యవిద్య అందించాలనే తపనతో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఒకేసారి మంజూరు చేయించి, యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. జగనన్న పాలనలోనే ఏడు కళాశాలలకు ఎంసీఐ అనుమతులు అభించగా, మిగిలిన పదింటికి అనుమతులు రాకుండా అడ్డుకున్నారని, ఇది దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించటం ద్వారా రాజ్యాంగబద్ధంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేద విద్యార్థులు రిజర్వేషన్ కోల్పోయి వైద్య విద్యకు దూరమై, తీవ్రంగా నష్టపోతారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క మెడికల్ కళాశాల కూడా మంజూరు చెయ్యలేదంటే ఆయనకు పేద విద్యార్థులపై ఎంత ప్రేమ ఉందో ఇట్టే అర్థమౌతుందని గణేష్ దుయ్యబట్టారు. నాడు విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేస్తాం అంటే సరస్వతీ దేవిని నడిరోడ్డుపై అమ్మకానికి పెడతారా అని టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు నిలదీశారన్నారు. ఆయన ఆ మెడికల్ కళాశాలను ప్రభుత్వ పరం చేశారని డాక్టర్ గణేష్ గుర్తు చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు వైద్యవిద్యను ప్రభుత్వ పరం చేస్తే, దానికి పూర్తి వ్యతిరేకంగా చంద్రబాబు నాయుడు ప్రైవేటు పరం చేస్తూ ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను మానుకోవాలని, లేనిపక్షంలో వైద్య విద్యార్థులతో కలసి వైఎస్సార్ సీపీ అధినేత ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని డాక్టర్ గణేష్ హెచ్చరించారు.

టీడీపీ నేత ఫరీద్ సలీం వైఎస్సార్ సీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

మేడికొండూరు: మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన మొదటి వార్డు మెంబర్, తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ ఫరీద్ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఆదివారం పేరిచర్లలో జరిగిన కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఫరీద్ సలీం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సరైన గుర్తింపు లేకపోవడంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న పోరాటానికి ఆకర్షితుడైనట్లు చెప్పారు. భవిష్యత్తులో గ్రామ ప్రజల అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ నాయకత్వంలో పనిచేస్తానని తెలిపారు. వనమా బాల వజ్రబాబు మాట్లాడుతూ 'గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం రోజు రోజుకీ పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఫరీద్ లాంటి యువ నాయకులు చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాడికొండ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజం కోసం పనిచేయాలి

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న లక్ష్మణరావు

మంగళగిరిటౌన్: శాస్త్రీయ సమాజం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నగర పరిధిలోని ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూల్‌లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక జిల్లా 18వ మహాసభలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలను కూడా మార్చివేస్తున్నారని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సినిమాల్లో మతానికి సంబంధించిన అంశాలను మాట్లాడడం సరికాదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు 80 శాతం పైగా చదువుకుంటున్నారని, అలాంటి పాఠశాలలను నిర్వీర్యం చేసేందుకు పాలకులు చూస్తున్నారని విమర్శించారు. ఇటీవల ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా కేఎస్ లక్ష్మణరావు, టి.రత్నారావు, డాక్టర్ ఏఎస్‌వీఎన్ ప్రసాద్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, అధ్యక్షుడిగా ఉదయ భాస్కర్, ఉపాధ్యక్షులుగా డి.ప్రసాద్, రమేష్, స్వాతి, అహమ్మద్ హుస్సేన్, కోశాధికారిగా రామారావు, ప్రధాన కార్యదర్శిగా జాన్ బాబు, కార్యదర్శులుగా రాము, ప్రసాద్, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, అనీల్‌కుమార్, గోకుల్ చంద్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించాలి

ఎస్టీయూ డిమాండ్



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

చిలకలూరిపేట: దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. చిలకలూరిపేటలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ముఖ్యమంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించి, బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు భారంగా మారాయని, వాటిని పునఃపరిశీలించి, వెంటనే మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను ప్రారంభించాలని కోరారు. సమావేశంలో వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, షేక్ మక్బూల్‌బాషా, దుర్గాప్రసాద్, బొంత రవి, జి కోటేశ్వరరావు సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన సంఘటన పట్టణ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కోండ్రుపాడు గ్రామానికి చెందిన రైతు ఇంటూరి యాదగిరి(27) సరుకుల నిమిత్తం గ్రామం నుంచి బైక్‌పై చిలకలూరిపేటకు బయలుదేరాడు. కొత్త హైవే బైపాస్ వంతెన సమీపంలోని రైస్‌మిల్లు సమీపానికి వచ్చే సరికిగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసిన గుర్తు తెలియని వాహనం ఇతని బైక్‌ను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఐ పేరుతో ఓ వ్యాపారికి రూ.62.25 లక్షలు టోకరా

లక్ష్మీపురం: నగరంలోని ప్రముఖ వ్యాపారికి సీబీఐ పేరుతో రూ.62.25 లక్షలు టోకరా వేశారు. ఈ ఘటనపై అరండల్‌పేట పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరంలోని భారత్‌పేట ప్రాంతానికి చెందిన ఓ కన్‌స్ట్రక్షన్ వ్యాపారం చేసే వ్యక్తికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఉత్తర్‌ప్రదేశ్ పోలీసు డిపార్ట్‌మెంట్ నుంచి, టెలికాం డిపార్ట్‌మెంట్, సీబీఐ నుంచి మాట్లాడుతున్నామని వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్ చేశారు. మనీ లాండరింగ్ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు, అతని వద్ద మీ పూర్తి వివరాలు ఉన్నాయని ఇరువురి మధ్య నగదు లావాదేవీలు జరిగినట్లుగా ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు. ఆ కేసులో అరెస్టు చేస్తామని బెదిరించారు. అరెస్టు చేయకుండా ఉండాలంటే, కేసులో క్లియరెన్స్ ఇవ్వాలి అంటే డబ్బులు ఇవ్వాలంటూ వ్యాపారి నుంచి పలు దఫాలుగా మొత్తం రూ.62.25 లక్షలు వసూలు చేశారు. అయినా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లు చేసి బెదిరిస్తూనే ఉన్నారు. దీంతో వ్యాపారి దిక్కుతోచక ఆదివారం రాత్రి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ –19 స్కూల్ గేమ్స్ జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశాన్ని సోమవారం గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాధికారి జె.పద్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, హైస్కూల్ ప్లస్, ప్రైవేటు కళాశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులందరూ హాజరై ప్రస్తుత విద్యా సంవత్సరంలో జరగబోవు ఉమ్మడి గుంటూరు జిల్లా సెలక్షన్స్ వేదికలతోపాటు తేదీలను ఖరారుపై చర్చించాల్సి ఉందని పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్‌ను రిలీవ్ చేసి సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశానికి పంపాలని ఆయా యాజమాన్యాల్లోని కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు.

అన్నదాత పోరును జయప్రదం చేయండి

వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు



భట్టిప్రోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. డాక్టర్ వైఎస్సార్ సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువులు అందించడంతోపాటు పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో ఘోరంగా విఫలమైనట్లు విమర్శించారు. యూరియాను కూటమి నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 9న రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో రైతులతో కలసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అన్నదాత పోరు కార్యక్రమంలో రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలోని రైతులు, కౌలు రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అశోక్‌బాబు పిలుపునిచ్చారు.

అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన



అద్దంకి సంతలో కొనుగోలుదారులపై దురుసుగా ప్రవర్తిస్తున్న కానిస్టేబుల్

అద్దంకి రూరల్: అద్దంకి వ్యవసాయశాఖ మార్కెట్ యార్డులో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తూ ఉంటారు. కూరగాయాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు ద్విచక్ర వాహనాలను ఎవరికీ అడ్డం లేకుండా అక్కడే ఉన్న అగ్నిమాపక శాఖ కార్యాలయానికి రెండు వైపులా పెడుతుంటారు. అయితే, ఈ మధ్యనే కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆ శాఖ కానిస్టేబుల్ ఆదివారం సంతకు వచ్చిన ప్రజలను ద్విచక్ర వాహనాలు పెట్టవద్దని హెచ్చరించసాగాడు. ఆఫీస్‌కు అడ్డంలేకుండా పెట్టకుంటామన్న వినలేదు. సంతకు వచ్చిన ఓ వ్యక్తిని బండ బూతులు తిడుతూ ''చొక్కా విప్పితే నీకంటే పెద్ద రౌడీనిరా'' అంటూ రెచ్చిపోయాడు. అక్కడే ఉన్న ఎస్ఐ వెంకట్రావు, తోటి సిబ్బంది వారించినా లెక్క చేయకుండా దూషిస్తూనే ఉన్నాడు. ఈ విషయంపై ఎస్ఐ వెంకటరావును వివరణ కోరగా కానిస్టేబుల్ ప్రవర్తనపై ఉన్నతాధికారులకు తెలియజేసున్నట్లు తెలిపారు.

చేనేత రంగానికి రూ.1000 కోట్లు కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాలకృష్ణ



మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

మంగళగిరి : రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి రూ.1000 కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని రత్నాలచెరువులోని సింహాద్రి శివారెడ్డి భవనంలో చేనేత కార్మిక సంఘం 9వ పట్టణ మహాసభ జంజనం శివ భవన్నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ పాలకులు అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక మరో వృత్తిలోకి వెళ్లలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని, 20 శాతం రిబేట్ సంవత్సరం కొనసాగించాలన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుడికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేసి, పనిచేస్తున్న సంఘాలను ప్రోత్సహించాలని కోరారు. మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు, సీఐటీయూ నాయకుడు ఎస్ఎస్ చెంగయ్య పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ నూతన అధ్యక్షుడుగా దోకుపర్తి రామారావు, ఉపాధ్యక్షుడిగా గోలి దుర్గాప్రసాద్, కార్యదర్శిగా సాదు నరసింహారావు, సహాయ కార్యదర్శిగా ఎం. శివచంద్రరావు, కమిటీ సభ్యులుగా జె. చంద్రమౌళి, కే కుమారి, కె.మల్లికార్జునరావు, జె. శివభావన్నారాయణ, వై. నాగు, జె. రవి, టి. హేమసుందరరావు ఎన్నికయ్యారు.

జాబ్ క్యాలెండర్‌పై మాట మార్చిన కూటమి ప్రభుత్వం

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌పై మాట మార్చిందని, తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. మంగళగిరి నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ మంగళగిరి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వలి మాట్లాడుతూ ఎన్ని కల సమయంలో నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి న తరువాత వారిని పూర్తి మోసం చేస్తు న్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2,30,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు కూటమి ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా నేటికీ నిరుద్యోగ భృతిపై ఒక్క సమీక్ష కార్యక్రమం కూడా నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సామ్యేలు, ఫిరోజ్, గోపిరాజు, నరేంద్ర, జాలాది నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం: స్థానిక రైల్వేస్టేషన్ దక్షిణం వైపు గల స్ట్రయిట్ కట్ కాలువ వద్ద రైల్వే బ్రిడ్జి కింద కాలవ నీటిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు. 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని.. ఎరుపు, నలుపు, తెలుపు గళ్ల పొడుగు చేతుల చొక్కా, నల్ల జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో పాడి గేదెలు మృతి



రోడ్డు పక్కన మృతి చెందిన పాడి గేదె

కారంచేడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు పాడి గేదెలు మృతి చెందాయి. స్థానికుల కథనం మేరకు.. వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ ప్రధాన రహదారిలో పర్చూరు-కారంచేడు రోడ్డులో శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవాలయం సమీపంలో ఆదివారం రెండు పాడి గేదెలు రోడ్డు పక్కన పడి మృతి చెంది ఉన్నాయి. ఆదివారం వేకువజామున, శనివారం అర్ధరాత్రి తరువాత గాని రోడ్డు పక్కన నడిచి వెళ్లే గేదెలను గుర్తు తెలియని హెవీ వెహికల్ ఢీకొందని భావిస్తున్నారు. మృతి చెందిన గేదెల ఆచూకీ కూడా తెలియలేదని స్థానికులు చెబుతున్నారు. వీటి విలువ సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్లో దూకి యువకుడు మృతి

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద ఉన్న కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఆదివారం ఉదయం బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన పుట్టా రాఘవరావు (40) దూకి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు చక్రవర్తి ఫిర్యాదు మేరకు మద్దిపాడు ఎస్సై జి.వెంకట సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాఘవరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సైదులు

చీరాల అర్బన్: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంపై ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం బోయినవారిపాలేనికి చెందిన మల్లవరపు విజయసారథి (45) వారం రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించగా మృతి చెందాడు.

యోగాసన పోటీలలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



తాడికొండ: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 50వ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఐదుగురు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 6–7 తేదీల్లో ద్వారకా తిరుమలలో నిర్వహించిన ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో మొక్కల అక్షయ ప్రథమ, ఆలా పూజిత తృతీయ, బొంత అనూష నాలుగో స్థానాలు సాధించగా సబ్ జూనియర్ విభాగంలో మొక్కల లక్ష్మీ ఆశ్రిత నాలుగో స్థానం సాధించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు యోగా అభ్యాసకుడు అన్నవరపు రాకేష్‌లను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. త్వరలో వీరు జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అసత్య ప్రచారాలను నమ్మవద్దు

నెహ్రూనగర్: ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన బార్ పాలసీపై కొంత మంది తమ స్వార్థంతో, ఇతరులు కొత్తవారు బార్ బిజినెస్‌లోకి రాకుండా అడ్డుకునేందుకు చెడు ప్రచారం చేస్తున్నారని అటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలియజేశారు. ఆదివారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 53 మంది, పల్నాడు జిల్లాలో 24 మంది బార్ లైసెన్సులు తీసుకొని చక్కగా వ్యాపారం చేస్తున్నారని తెలియజేశారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 15న కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఈఎస్ అరుణ కుమారి, ఏఈఎస్ మారయ్యబాబు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమితి విద్యా పారితోషికం ప్రదానం



స్కాలర్‌షిప్పులు అందుకున్న విద్యార్థులతో బ్రాహ్మణ సేవాసమితి సభ్యులు

గుంటూరు మెడికల్: బ్రాడీపేటలో బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి విద్యా పారితోషిక ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు నందిరాజు పాండురంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ పాల్గొన్నారు. 252 మంది విద్యార్థులకు రూ.21.50 లక్షలు అందించారు. పాండురంగారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థానం పొందిన తరువాత, సమితి వారికి సహాయ సహకారాలు అందజేయాలన్నారు. బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి ఎం.లక్ష్మీపతి పర్యవేక్షించారు. విద్యా పారితోషికాల చైర్మన్ ఎ.సంజీవరావు, కో చైర్మన్ కర్లపాలెం బాలకృష్ణ, కోశాధికారి తుళ్లూరు ప్రకాష్, ఉపాధ్యక్షుడు మాదల వెంకటకృష్ణ, సహాయ కార్యదర్శులు ఆదిరాజు శ్రీధర్, బొప్పూడి కృష్ణ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాతూరు శ్రీనాథ్, కోదండ రామారావు, మారుతీ రామ్ గోపాల్, పాంచజన్య శర్మ, కటక రాజు సాయిబాబా శర్మ, గంద్రకోట వెంకటేశ్వరరావు, మద్దూరు రామకృష్ణ పరమహంస, వింజనంపాటి సుబ్రహ్మణ్యం, వి.ఫణీంద్ర కుమార్, అవ్వారి మంగాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రైతుల సమస్యలపై శ్రద్ధలేదు

- 9న అన్నదాత పోరు జయప్రదం చేయండి
- వైఎస్సార్ సీపీ రైతు విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు పున్నారెడ్డి



నరసరావుపేట: కూటమి ప్రభుత్వానికి మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయటంలో ఉన్న శ్రద్ధ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై లేదని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి అప్రమత్తం చేసి కళ్లు తెరిపించే ఉద్దేశంతో పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10గంటలకు అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతులు యూరియా కోసం రోడ్డుమీద పడి కాపు కాయాల్సి వస్తుందన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా అధిక ధరకు అమ్ముతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయశాఖ నిద్రపోతున్నట్లుగా ఉందని, వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నాడా, లేదా అనే అనుమానం ప్రజల్లో తలెత్తుతుందన్నారు. అధికారులు యూరియాకు కొరత లేదని పదే పదే ప్రకటనలు ఇస్తున్నారని, యూరియా ఎక్కడికి వెళ్తుందని ప్రశ్నించారు. వాస్తవానికి దళారుల చేతుల్లో యూరియా ఉందని, ప్రభుత్వం, అధికారులు దళారులకు బానిసలు అయ్యారని పేర్కొన్నారు. రైతుల్ని ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం, నాయకులైన బాగుపడ్డ చరిత్ర లేదని అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రైతు సమస్యలను పరిష్కరించాలని కోరారు. శాంతియుత నిరసన ర్యాలీ అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వటం జరుగుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు కూలీలు, రైతు సంఘ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.